చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు

బిజినేపల్లి, అక్టోబరు 6 : కేఎల్‌ఐ కాలువలో చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని సల్కెరపేట చెందిన శ్రీశైలం, గోవిందమ్మ చిన్న కుమారుడు మేఘస్వామి(22) రోజులాగే పొలం వద్దకు వెళ్లాడు. పక్కనే ఉన్న కేఎల్‌ఐ కాలువలో చేపలు పట్టేందుకు డీ-10 కాలువకు నీరు వదిలే షెట్టర్ల వద్ద నీటిలోకి దిగాడు. నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో కొట్టుకుపోయాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కాలువలోకి దిగి గాలించినా ఆచూకీ లభించలేదు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి వెళ్లి పరిశీలించారు. దీనిపై ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్‌ఐ తెలిపారు. శ్రీశైలం, గోవిందమ్మలకు ఇద్దరు కుమారులు ఉండగా 15 ఏళ్ల క్రితం పెద్ద కుమారుడు పాము కాటుతో మృతి చెందగా, రెండో కుమారుడు మేఘస్వామి కేఎల్‌ఐలో గల్లంతవ్వడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

మైదానాల్లో పిచ్చి మొక్కలు

తుప్పు పట్టిన పరికరాలు



మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని ఎదిర 4వ వార్డులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో మొలిచిన పిచ్చి మొక్కలు

- బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు
- 2022 జూలైలో ప్రారంభించిన గత ప్రభుత్వం
- అరకొర వసతులు.. ఆడుకునేందుకు అనుకూలంగా లేని గ్రౌండ్లు
- వాటికి బిల్లులు దండుకున్న కాంట్రాక్టర్లు
- కొన్ని చోట్ల కిట్లు పంపిణీ చేసినా సౌకర్యాలు లేక నిరుపయోగం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 6: గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు, గడ్డితో దర్శనమిస్తున్నాయి. క్రీడా పరికరాలు తుప్పు పట్టిపోయాయి. వాటిని చూస్తే ఇవి క్రీడా ప్రాంగణాలేనా? అన్న సందేహం కలగక మానదు. దాంతో వాటి వద్దకు వెళ్లేందుకు చిన్నారులు ఇష్టపడటం లేదు. ఉమ్మడి జిల్లాలో ప్రతీ గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి, క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దారు. 2,278 గ్రామాలు, ఆవాసాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, 20 శాతానికిపైగా గ్రామాల్లో ఇప్పటికీ ఏర్పాటు కాలేదు.

మునిసిపాలిటీల్లో అధ్వాన్నం

గ్రామీణ ప్రాంత క్రీడా మైదానాలు దయనీయంగా ఉంటే.. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. మునిసిపాలిటీల్లో లక్ష్యం మేర క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయకపోగా, ఏర్పాటైనట్లుగా చెబుతున్నవీ వినియోగంలోకి రాలేదు. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా, 385 వార్డుల్లో 434 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తొలి విడతలో 44 ప్రాంగణాల్ని అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. తర్వాత పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారులు పూర్తి చేసినట్లు చెబుతున్నా ప్రాంగణాల్లో కనీస వసతులు కల్పించ లేదు. పేరుకు బోర్డులు తగిలించి, చేతులు దులుపుకున్నారు. మైదానాలను చదును చేసి, వదిలేయడంతో పిచ్చిమొక్కలతో దర్శనిమిస్తున్నాయి. పావు ఎకరంలోనే సర్దుబాటు చేశారు. అరకొర వసతులతో, ఆడుకునేందుకు అనుకూలంగా లేని వాటికి బిల్లులు మాత్రం దండుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు పాఠశాలలోనే ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

పూర్తి స్థాయిలో చేరని క్రీడా సామగ్రి

క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి రూ.లక్షలు వెచ్చించి తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాంగణాల పేరుతో 2022 జూలైలో గత ప్రభుత్వం క్రీడా మైదానాలను ప్రారంభించింది. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్ కోర్టులతో పాటు వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల పాఠశాల మైదానాలకే బోర్డులు తగిలించి, ఆవే క్రీడా ప్రాంగణాలుగా నిర్ణయించారు. ఈ క్రీడా ప్రాంగణాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఉద్దేశించిన వీటి లక్ష్యం నెరవేరలేదు. ఆటలు ఆడేందుకు పంపిణీ చేసిన క్రీడా సామాగ్రి సైతం గ్రామాలు, పట్టణాలకు పూర్తిస్థాయిలో చేరలేదు.

నిరుపయోగంగా కిట్లు

గ్రామాల్లో కొన్ని చోట్ల పాఠశాల మైదానాల్లోనే వాలీబాల్, ఖోఖో, కబడ్డీ లాంగ్‌జంప్ కోర్డులు ఏర్పాటు చేసి, మమ అనిపించారు. ఈ ప్రాంగణాల చుట్టూ మీటరు లోపు ఎత్తు పెరిగిన మొక్కలు నాటాల్సి ఉండగా నాటలేదు. కొన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో వాటివైపు ఎవరూ చూడటం లేదు. పూర్తయిన క్రీడా ప్రాంగణాల కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కిట్లను అందించారు. వాటిలో క్రికెట్, వాలీబాల్ కిట్లు, 75 టీ-షర్టులు, డంబెల్స్, డిస్కస్‌త్రో, టెన్నికాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్, విజిల్స్, కొలతల టేపులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 70 శాతం వరకు కిట్లు పంపిణీ చేశారు. అందులో 30 శాతం మేర ప్రాంగణాలు సరిగా లేకపోవటంతో వాటి ఎలా సద్వినియోగం చేసుకోవాలని యువత ప్రశ్నిస్తోంది. స్థలభావం, ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

జిల్లాల వారీగా ఇదీ పరిస్థితి

- నారాయణపేట జిల్లాలో 280 గ్రామాలుండగా అన్ని చోట్లా క్రీడా ప్రాంగణాలకు స్థలాలు గుర్తించారు. అయితే చాలా చోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఏర్పాటు చేసిన సామాగ్రి కనిపించడం లేదు.
- జోగులాంబ గద్వాల జిల్లాలో 255 పంచాయతీలకు గాను గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు చాలా చోట్ల స్థలాలు లేక 70 శాతం మాత్రమే పూర్తి చేశారు. వాటిలో అధికంగా గడ్డి, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఒక్కో పంచాయతీకి సుమారు రూ.50 వేల వరకు ఖర్చు చేసినా లక్ష్యం నెరవేరలేదు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 464 పంచాయతీల్లో ఏర్పాటుకు క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. చాలా చోట్ల వీటిని పాఠశాలల్లోనే ఏర్పాటు చేశారు. మిగతా చోట్ల స్థలాలు చదును చేసి వదిలేశారు.
- వనపర్తి జిల్లాలో 260 పంచాయతీలకు గాను 70 శాతం మాత్రమే పూర్తి చేశారు. ఆయా మైదానాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో వాటి వద్దకు వెళ్లేందుకు క్రీడాకారులు ఇష్టపడటం లేదు. అందులో చెట్లు మొలిచి, నిరుపయోగంగా మారాయి.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 441 గ్రామ పంచాయతీల్లో 80 శాతం మైదానాలకు స్థలాలు కేటాయించారు. కానీ చాలా చోట్ల పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్న వాటిలో గడ్డి మొలిచి, అందులోకి వెళ్లేందుకు వీల్లేకుండా మారాయి. కొన్ని పంచాయతీల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో పిల్లలు వచ్చి ఆడుకుంటున్నారు. గతంలో ఇచ్చిన క్రీడా సామాగ్రి తుప్పు పట్టిపోయింది. ఖోఖో, వాలీబాల్ పోల్స్ ఎత్తుకెళ్లారు.



వనపర్తి పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు

తెగులు గుబులు

- అధిక వర్షాలతో వరిని ఆశించిన సుడిదోమ, బ్యాక్టీరియా
- ఆందోళనలో రైతులు
- నీళ్లు తరచుగా మార్చాలంటున్న అధికారులు
- వనపర్తి జిల్లా వ్యాప్తంగా లక్షా 62 వేల ఎకరాల్లో సాగు



మూలమల్లలో తెగులు సోకిన వరి పంటకు డ్రోన్ ద్వారా పిచికారి చేస్తున్న పురుగు మందు

ఆత్మకూరు, అక్టోబరు 6: వనపర్తి జిల్లాలో వరికి తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, అవి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. జిల్లాలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, రామన్‌పాడు, గోపాల్‌దిన్నె రిజర్వాయర్లతో పాటు ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో చెరువుల కింద అధికంగా 162 వేల ఎకరాల్లో వరిని సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం పండించిన రైతులకు క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడంతో అత్యధికంగా ఆర్‌ఎన్‌ఆర్ 15048, బీపీటీ 5204 వంటి రకాలను సాగు చేశారు. ప్రస్తుతం వంట పొట్ట దశకు చేరుకుంది. ఈ సమయంలో వైరస్, సుడిదోమ తెగుళ్లు పంటను ఆశించాయి. గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన అధిక వర్షాల వల్లే వరి పంటకు తెగుళ్లు సోకాయని రైతులు చెబుతున్నారు.

డ్రోన్ల ద్వారా మందుల పిచికారి

ఇటీవల రైతులకు ఇబ్బందులు లేకుండా డ్రోన్ ద్వారా క్రిమి సంహార మందులు పిచికారి చేస్తున్నారు. ఎకరాకు 10 లీటర్ల నీటితో నిమిషాల్లోనే పంటకు పురుగు మందును కొడుతున్నారు. రైతులు ఈ పద్ధతిన మందు పిచికారి చేసేందుకు ముందుకు రావాలని అధికారులు అంటున్నారు. అయితే మందులు సరైనవి ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. లేదంటే నకిలీ మందుల ద్వారా మరింత మోసపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.

సస్యరక్షణ ఇలా..

రైతులు యూరియా వాడకం తగ్గించి, పొలంలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తీసి, కొత్తనీరు పెట్టడం వల్ల తెగుళ్లు తగ్గుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పొలంలో కాలి బాటలు, బాదులు ఏర్పాటు చేసుకుంటూ మొక్కలకు సమపాళ్లలో ఆక్సీజన్, వెలుతురు అందడం వల్ల సుడిదోమ నివారణ అవుతుందని, తెగుళ్లు వ్యాపించే అవకాశం తక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

తెగుళ్ల నివారణపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో పంటను సుడిదోమ, బ్యాక్టీరియా తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయి. బీపీటీ 5204 రకంలో ఎక్కువగా సుడిదోమ వ్యాపిస్తుంది. తెగుళ్లకు సరిపడా మందులను ఎంచుకునేలా అధికారులు అవగాహన కల్పించాలి.

\- విష్ణువర్ధన్ రెడ్డి, వరి రైతు, మూలమల్ల

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

వాతావరణ మార్పులతో పాటు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల వరిని తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. యూరియా ఎక్కువగా వాడితే పీలికలు ఎక్కువగా వచ్చి, మొక్కలకు సరైన ఆక్సీజన్ అందక సుడిదోమ, బ్యాక్టీరియా తెగుళ్లు వ్యాపిస్తాయి. పొలంలో పాదులు ఏర్పాటు చేసుకొని, ఎప్పటికప్పుడు కొత్త నీరు పెట్టాలి. రసయానిక ఎరువులు ఎక్కువవగా వాడితే తెగుళ్లు రావడంతో పాటు, పోషకాలు ఇచ్చే కీటకాలు నశిస్తాయి. నేలలు జీవం కోల్పోయి చౌడుగా మారుతాయి.

\- వినయ్ కుమార్, ఏవో, ఖిల్లాఘణపురం

నేడు మంత్రుల పర్యటన

నాగర్‌కర్నూల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి మూడు గంటలకు రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండల కేంద్రానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడి నుంచి 3:30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం నాలుగు గంటల నుంచి 5:30 వరకు కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీతోపాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి పాల్గొంటారని చెప్పారు. అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 5:45 గంటలకు కల్వకుర్తి మండలంలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ప్రారంభిస్తారన్నారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తారని తెలిపారు.

అచ్చంపేటకు కొండా సురేఖ

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 12 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరి, 12:50 గంటలకు అచ్చంపేట పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో ఉమామహేశ్వర దేవస్థానానికి చేరుకుని, ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. అక్కడి నుంచి అచ్చంపేటకు చేరుకుని, భోజనం అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పాల్గొంటారని చెప్పారు. సాయంత్రం 4:20 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరిగి మెదక్ జిల్లా పర్యటనకు బయల్దేరి వెళ్తారని పేర్కొన్నారు.



భక్తులకు కూష్మాండ దేవిగా దర్శనమిస్తున్న అలంపూర్ జోగుళాంబ, ఉమామహేశ్వర భ్రమరాంబ అమ్మవార్లు

కూష్మాండ దేవిగా దర్శనం

అలంపూరు/అచ్చంపేట అర్బన్, అక్టోబరు 6: దసరా శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూరు జోగుళాంబ, శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం భ్రమరాంబ అమ్మవార్లు నాల్గో రోజు ఆదివారం కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలంపూర్‌కు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలొచ్చారు. అమ్మవారికి దర్బారు సేవ నిర్వహించారు. అలంకారం తర్వాత సువాసిని, కుమారి, పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని రథంలో ఉంచి, ఆలయ ప్రాకారం చుట్టూ తిప్పారు. కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉమామహేశ్వర క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారికి పుణ్యాహవచనం, మండపారాధన, కలశ తదితర పూజలు చేశారు.

మహాలక్ష్మీదేవిగా వాసవీ మాత

- రూ.6,66,66,666.66లతో అమ్మవారి అలంకరణ

పాలమూరు, అక్టోబరు 6 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు ఆదివారం లక్ష్మీదేవిగా భక్తుల పూజలందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండా వెంకటేశ్, మిర్యాల వేణుగోపాల్ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.6,66,66,666.66 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. తమిళనాడుకు చెందిన కళాకారులు నోట్లతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.



మహాలక్ష్మీ దేవి అలంకరణలో వాసవీ మాత



ఆలయం మొత్తం నోట్లతో అలంకరణ

బాస్కెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవాలి

- బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలు


ఉమ్మడి జిల్లా మహిళా బాస్కెట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 6 : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ సూచించారు. ఈ నెల 14, 15 తేదీల్లో సికింద్రాబాద్ జింఖాన మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళ జట్టు ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నసూరుల్లా హైదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్ ఖలీద్ అలీ, జాయింట్ సెక్రటరీ మహ్మద్ ఇలియాజ్, ఫారుక్‌ముక్రం, కోచ్ ఖలీల్ పాల్గొన్నారు. జట్టుకు ఎంపికైన వారిలో జ్యోతి, కె.ప్రియాంక, అర్పిత, శ్రీవల్లిక, భువనేశ్వరి, సాయినిఖిత, హర్షిత, చైత్ర, శ్రీలత,హారిణి, మేఘన, వైష్ణవి ఉన్నారు.

ఇద్దరిని ఢీ కొట్టిన గుర్తుతెలియని వాహనం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

జడ్చర్ల, అక్టోబరు 6 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల క్రాస్‌రోడ్డులోని ఫ్లైఓవర్‌పై శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, గరియా బాద్ జిల్లా సవాపర గ్రామానికి చెందిన ముర్హ తన కుటుంబంతో కలిసి జీవనోపాధి కోసం 15 రోజుల క్రితం జడ్చర్లకు వచ్చారు. జాతీయ రహదారిపై ఉన్న ఓ హోటల్ సమీపంలో ఇటుక బట్టీలో కూలీ పనులు చేసుకుంటున్నారు. అదే ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిచ్‌పరా చెందిన కాలురామ్‌తో కలిసి ముర్హ శనివారం అర్ధరాత్రి ఇటుకబట్టీ నుంచి జడ్చర్లకు వెళ్లి, ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముర్హ తలకు తీవ్ర గాయమై అక్కడిక క్కడే మృతి చెందాడు. కాలురామ్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. ముర్హ కుమారుడు రాంనారాయణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఇంట్లో నగదు, ఆభరణాలు చోరీ..

నవాబ్‌పేట, అక్టోబరు 5 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగులగొట్టి నగదు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్లలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాయిండ్ల వెంకటయ్య వేరే గ్రామానికి వెళ్లగా, కూతురు ఆదివారం ఉదయం కూలీ పనులకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువ తాళాలు పగులగొట్టి రూ.1.50లక్షల నగదు, 30 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కూతురు నిఖితకు ఇంటి పక్కల వారు సమాచారం ఇవ్వడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా నగదు, ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రాజాపూర్, అక్టోబరు 6: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి ఆదివారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని మల్లేపల్లి రోడ్డులో ట్రాక్టరు, కుచ్చర్‌కల్ శివారులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను శనివారం అర్ధరాత్రి, ఆదివారం ఉదయం బ్లూకోర్టు సిబ్బంది పెట్రోలింగ్‌నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

హన్వాడ, అక్టోబరు 6: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో ప్రభుత్వ గ్రామ కంఠం భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు కూల్చివేశారు. అక్రమంగా వేసిన డబ్బాలను తొలగించారు. గత పాలకులు ఇచ్చిన అనుమతులపై కొందరు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాటిని తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో పంచాయతీ సిబ్బంది తొలగించి, గ్రామ కంఠం భూమిని చదును చేశారు. ప్రభుత్వ గ్రామ కంఠం భూమిలో ఎవరూ నిర్మాణాలు చేయొద్దని అధికారులు కోరారు.

మైనార్టీలను సెకండ్ సిటిజన్స్ చేసే కుట్ర



మాట్లాడుతున్న మధిహురుల్ రెహమాన్ షేర్వాని సాబ్, చిత్రంలో పలువురు ప్రతినిధులు

- అలిగఢ్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ మధిహురుల్ రెహమాన్ షేర్వాని సాబ్
- కొనసాగిన ఆల్ ఇండియా తంజీమే- ఈ- ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు

పాలమూరు, అక్టోబరు 6 : భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో ముస్లిం, క్రిస్టియన్, బౌ ద్ధ, జైన తదితర మైనారిటీల వర్గాల ప్రజలను సెకండ్ సిటిజన్స్ చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అలిగడ్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ మధిహురుల్ రెహమాన్ షేర్వాని సాబ్ విమర్శించారు. ఆల్ ఇండియా తంజీమే - ఈ - ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు ఆదివారం రెండో రోజు జిల్లా కేంద్రంలో కొనసాగాయి. మతోన్మాద మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత ఛాందస విధానాలను వేగంగా రాజకీయ ప్రభుత్వ రంగాల్లో విస్తరింపజేసి మత ప్రాతిపదికన ప్రజలను విభజిస్తూ మత ఘర్షణలకు సంఘ్‌పరివార్ శక్తులకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, దేశసమగ్రతను ఔన్నత్యాన్ని దెబ్బతీసే విధంగ కేంద్ర ప్రభుత్వ పాలన విధానాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్టు-2024 అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల హక్కులను కాలరాసే విధంగ కేంద్ర ప్రభుత్వం వ్యవహరించే తీరును ఆయన తప్పుపట్టారు. ప్రధాని తప్పుడు విధానాలతో దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పార్లమెంట్‌లో బలం ఉందనే అహంకారంతో వక్ఫ్ చట్టానికి సవరణలు చేసినా ప్రజాబలంతో తిరిగి మైనారిటీ హక్కులను కాపాడుకునేందుకు ఏమాత్రం వెనుకడుగు వేయమన్నారు. దేశంలో మైనారిటీలను రెండో తరగతి పౌరులుగా విభజించి వారి ఆస్తులను దుర్మార్గంగా లాక్కోవాలని దురుద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. మైనారిటీల ఆస్తులను హరించే విధంగా మోదీ సర్కారు వ్యవహరిస్తోందని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మైనారిటీల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. ఆల్ ఇండియా తంజీమే -ఈ- ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాష, ఇన్సాఫ్ జాతీయ గౌరవ అధ్యక్షుడు అహ్మద్ షేర్వానీ, ఇర్ఫాన్ ఆలం, ఇస్లామోద్దీన్, షేకిబుల్ రహమాన్, నవాబ్, నూనినిసాన్, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫయాజ్, మునీర్‌పటేల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు యం.బాలనరసింహ, జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, డి.రాము, రాజు, శంకర్, సత్యనారాయణరెడ్డి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి


కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.


రాజుయాదవ్


శ్రావణి (ఫైల్)

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, .భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పోలీసుల అదుపులో కంప్రెషర్ వాహనాలు



పోలీస్‌స్టేషన్ వద్ద కంప్రెషర్ వాహనాలు, ట్రాక్టర్

ఊర్కొండ, అక్టోబరు 6 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గుట్టలపై ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లకు ఉపయోగిస్తున్న రెండు కంప్రెషర్ వాహనాలతో పాటు ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అధికార పార్టీ మండల నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఊర్కొండపేట గుట్టలపై ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఊర్కొండ ఎస్‌ఐ వీరబాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఊర్కొండపేట గుట్టలపై బ్లాస్టింగ్‌లకు ఉపయోగిస్తున్న రెండు కంప్రెషర్ వాహనాలు, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెంట్లవెల్లి జడ్పీ బాలుర పాఠశాలలో పూర్వ విద్యార్థులు

పెంట్లవెల్లి, అక్టోబరు 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 1997-1998 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులకు శాలువాతో పూలదండలతో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పూర్వపు ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, కాంతరెడ్డి, శ్రీహరి, వెంకటస్వామి, శ్యాంసుందర్, పూర్వపు విద్యార్థులు విజయ్, గోవురాజు, భైరోజు శేషు, బాలకృష్ణ, రమణ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 - 96 పదవతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ఆకృతిగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాడు చదువులు చెప్పిన గురువులు ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఘురాములు, గోసులరాములును విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం వారికి జ్ఞాపికలు అందజేసి పాదాభివందనం చేశారు. ఎల్‌బీ నగర్ డీసీపీ శ్రీనివాసులు, లింగం, వీరారెడ్డి, నర్సింహ, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, మల్లేష్ ఉన్నారు.

కాన్షీరాం వర్ధంతిని జయప్రదం చేయండి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 6: జిల్లా కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించనున్న బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరాం 18వ వర్ధంతిని జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోకి వ్యక్తులు వస్తుంటారు పోతుంటారని, వారి గురించి ఆలోచించకుండా బహుజన సమాజ శ్రేయస్సు కోసం కలిసి పని చేద్దామని పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో ఫంక్షన్‌హాలులో నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని బీఎస్పీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, మాజీ జిల్లా అధ్యక్షుడు పృధ్వీరాజ్, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్, నాయకులు రాంచందర్, రాజు, బాలనాగులు, మడుపు నాగేష్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

దేదినేనిపల్లి కృష్ణ చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 6 : మండల పరిధిలోని దేదినేనిపల్లి కృష్ణ చెరువుకు పడిన గండికి మరమ్మతులు చేపట్టాలని నాయినోనిపల్లి మైసమ్మ దేవత ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి.సలీం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేదినేనిపల్లి కృష్ణ చెరువు గండిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం వర్షం పడటంతో వరద ప్రవాహంతో చెరువు నిండి గండి పడింది. దీంతో చెరువులో ఉన్న నీరు అంతా వృథాగా పోతుందని వారు పేర్కొన్నారు. చెరువులోని నీరంతా వృథాగా పోవడంతో చెరువు కింద సాగు చేసిన ఆయకట్టు రైతులకు నీరు పెట్టడం ఇబ్బందికరంగా మారుతుందని వారన్నారు. సంబంధింత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గండికి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పాములపై నల్లమల వాసులకు అవగాహన

మన్ననూర్, అక్టోబరు 6: వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలోని మన్ననూరు పర్యాటక వనమాలికలలో వివిధ రకాల పాములపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలు, విద్యార్థుల కు జంతుశాస్త్ర లెక్చరర్ డాక్టర్ సదాశివయ్య ఆధ్వర్యంలో పాముల ప్రదర్శన నిర్వహించారు. పాముల వలన పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. పాములను చూసి భయపడాల్సిన అవసరం లేద న్నారు. కట్లపాము, రక్త పింజర, నాగుపాములు విషపూరితమైనవని, జెర్రిపోతు, నీ రికట్ట, వానకోయిల, మట్టిపాములు విషం లేని పాములన్నారు. అమ్రాబాద్ అడ వుల్లో రక్త పింజర, కట్లపాము, చిన్నపింజర బాంబో పిట్ వైపర్ పాములున్నట్లు తెలిపారు. పాముంటే భయం వీడేలా పాములను చిన్నారులతో పట్టించి భయం వీడేలా ప్రదర్శన చేశారు. పాములను చూసి భయపడాల్సిన అవసరం లేదని ఎ క్కడైనా పాములు ఉన్నట్లయితే స్నేక్ సొసైటీ సభ్యులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందిస్తే పాములను పట్టుకొని వెళ్లి అడవిలో వదులుతారన్నారు. అటవీ రేంజ్ అధికారి దేవజ, అటవీ విద్యాధికారిణి శ్వేత పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చోరీ

తిమ్మాజిపేట, అక్టోబరు 6 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం లోని మరికల్ శివారులోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో పరికరాలు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 4వ తేదీన అసిస్టెంట్ ఇంజినీర్ లిల్లీ రోజ్ పరికరాలు సరి చూసుకుని విధులు ముగించుకుని జడ్చర్లకు వెళ్లిపోయారు. మరుసటి రోజు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న దీపక్‌రాజుసింగ్ 220కేవీ వెల్ టూర్ ఒకటి, రెండు ఫీడర్ ఐసోలేటర్ కాపర్ రాడ్స్ నాలుగు నెంబరు కనిపించలేదు. దీంతో అసిస్టెంట్ ఇంజినీర్‌కు సమాచారమివ్వగా వెంటనే సబ్ స్టేషన్ వెళ్లి పరిశీలించి దాదాపు రూ.లక్ష విలువ గల సామాగ్రి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. లిల్లీరోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సోమశిలలో సినిమా షూటింగ్ సందడి



సోమశిల వద్ద చిత్ర యూనిట్

కొల్లాపూర్, అక్టోబరు 6: సోమశిలలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శివగాడు యమస్పీడ్ సినిమా చిత్రీకరణను సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయంలో ప్రారంభించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ మేకల రమ్య క్లాప్ కొట్టి కెమెరాను ఆన్ చేశారు. కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్, ప్రొడ్యూసర్, హీరో శివ జొన్నలగడ్డ కాగా, హీరోయిన్‌గా మానస నటిస్తున్నారు. గతంలో తాను తీసిన దీక్ష, శనిదేవుడు సినిమాలకు రెండు నంది అవార్డులు వచ్చాయని డైరెక్టర్ శివ జొన్నలగడ్డ తెలిపారు. రెండు రోజుల పాటు సోమశిల కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో చిత్రీకరణ కొనసాగుతుందని చెప్పారు.

పండగల వేళ.. పరేషాన్‌లో ప్రజలు

● కూరగాయల ధరలకు రెక్కలు

- నిలకడలేని నిత్యావసరాలు
- ఎల్లలు దాటిపోతున్న ఎల్లిగడ్డ
- ఉసూరుమంటున్న ఉల్లి
- చిర్రెత్తిస్తున్న చింతపండు
- సామాన్యుడికి ధరాఘాతం



నిత్యావసర సరుకులు

అచ్చంపేట, అక్టోబరు 6: పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలతో సామాన్యుడి జీవన చిత్రం మారిపోతున్నది. సగం ఖాళీ కడుపుతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొన్నది. రైతుల పంట పొలాల్లోని కూరగాయ లు ఇటీవల కురిసిన వర్షాలతో కనుమరుగయ్యాయి. పొరుగు రాష్ట్రాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి. అధిక వర్షాలతో చేతికి అందివచ్చే పం టలు ఆగమాగమయ్యాయి. దీంతో రైతుల చేతుల్లో చిల్లీ గవ్వ కూడా లేకుండా పోయింది. ఇది ఇలా ఉంటే నిలకడ లేని నిత్యావసరాలతో సామాన్య ప్రజలు కుదేలవుతున్నారు. ఒక పక్క భారీ వర్షాలు మరో పక్క పెరుగుతున్న ధరలతో ప్రజలు తల్లడి ల్లుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో ఎల్లిగడ్డ రూ.400 పైమాటే.. ఉల్లి ఆఫ్ సెంచరీ దాటిపోతుంటే చింతపండు, అల్లం వందకి పైగా ఉన్నాయి. ఈ సీజన్‌లో అతి తక్కువగా లభించాల్సిన కూరగాయల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని అంటుతున్నాయి. పండగల వేళ పరేషాన్‌లో ప్రజలున్నారని చెప్పవచ్చు. ప్రభు త్వం రైతు బజారు కేంద్రాలను ఏర్పాటు చేసి సామా న్యులకు చౌకధరలకు నిత్యవసరాలు, కూరగాయలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఇలా...

కిలో ధర		కిలో ధర	
ఎల్లిగడ్డ	400	టమాటా	70
అల్లం	100	మిర్చి	40
చింతపండు	110	వంకాయలు	50
ఉల్లిగడ్డ	60	బెండ	40
కందిపప్పు	170	దొండ	60
పెసరపప్పు	120	చిక్కుడు	60
మినపప్పు	140	కాకర కాయ	60
పల్లినూనె ప్యాకెట్	140	దోస	50
సన్‌ఫ్లవర్ ప్యాకెట్	135	క్యాప్సికమ్	100
నువ్వులు	210	బీట్‌రూట్	60
జీలకర	350	క్యాబేజీ	80



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా కూరగాయలు

పండగపూట ఏమి కొనేటట్లు లేదు



ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పండగ పూట ఏమి కొనేటట్లు లేదు. మాబోటి వాళ్ల పెరిగిన ధరలతో కడుపునిండా తినలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం రైతు బజార్లు పెట్టి కూరగాయల ధరలు తక్కువ చేస్తే బాగుంటది.

-రాధ, అచ్చంపేట

స్థానికంగా కూరగాయలు లభించడం లేదు



ఈ సీజన్‌లో స్థానిక రైతుల నుంచి కూరగాయలు ఎక్కువగా మార్కెట్‌కు వచ్చేవి. కానీ ఈ మధ్య కాలంలో కురిసిన వర్షాలతో కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అందుకోసం ఆంధ్ర రాష్ట్రంలోని అనంతపూర్, కర్నూల్ నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నాం. అందువల్లే కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి.

- మల్లయ్య, కూరగాయల వ్యాపారి, అచ్చంపేట

అన్నపూర్ణాదేవిగా వాసవీ మాత

- విశేష పూజల్లో న్యాయాధికారుల దంపతులు



అన్నపూర్ణాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నాగర్‌కర్నూల్‌లో అన్నపూర్ణాదేవి అలంకరణ..

కందనూలు, అక్టోబరు 6 : జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న 54వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి మాత అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజా కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి సబిత, మహేందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక, శ్రీవిక్రమ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఆకుతోట రాణి, మధుమోహన్, మాదంశెట్టి సునీత, బాలేశ్వర్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి హరిబాబు దంపతులతో పాటు ఉత్సవ కమిటీ ఆలయ ప్రధాన అర్చకుడు జోషి పాండురంగయ్యశర్మలు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సామూహిక పూజా కార్యక్రమానికి అనేక మంది జంటలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో విశేష బిల్వదల, తులసి అర్చన, పంచ హారతులు డోలోత్సవం, పల్లకి సేవ అనంతరం లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం డాక్టర్ హరిప్రియ రోహిత్‌కుమార్ ఆధ్వర్యంలో వెల్‌బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. డైనమిక్ మహిళా సిండికేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య నాటక ప్రదర్శన భక్తులను అలరించింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఆకుతోట మధుమోహన్, సూరంపల్లి రాధాకృష్ణ, కొట్ర బలరాముడు, డీవీ నారాయణ, శరత్‌బాబు, మిడిదొడ్డి నీలకంఠం, బిల్లకంటి నందు, సోమిశెట్టి చంద్రశేఖర్, బాదం నరేందర్, కొండూరు కిరణ్, సంబు పాండు, రామ్మోహన్, ప్రమోద్, హాకీమ్, కిషోర్, గంధంప్రసాద్, బాదం పరమేశ్వర్, మలిపెద్ది చంద్రశేఖర్, రాఘవేందర్, సాయిశంకర్, ఆకారపు రామ్మోహన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

మహాలక్ష్మి రూపంలో అమ్మవారు

వంగూరు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వంగూరులోని గెల్వలాంబ మాత ఆలయంలో ఉత్సవ మండపంలో దుర్గామాత మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ నకినమోని శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

లలితా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

అచ్చంపేటటౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని భ్రమరాంబికా దేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరి దేవిగా ఆదివారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో లలితా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారిని అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. మహిళా కమిటీ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు ఘనంగా జరుపుకున్నారు. అర్చకులు ఉదయ్ భాస్కర్ శర్మ, శ్రీనివాస్ శర్మ భక్తులకు పూజలు చేయించారు. అదేవిధంగా కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి దేవిగా అలంకరించిన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో కమిటీ అధ్యక్షుడు వనం పర్వతాలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రాజరాజేశ్వరిదేవి అలంకరణలో వాసవీమాత

కల్వకుర్తి: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఆలయ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నాల్గవ రోజు ఆదివారం వాసవీమాత రాజారాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లోజు ఆచారి మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. అంతకు ముందు అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు నారాయణరాజు, నితిన్‌కుమార్, కోశాధికారులు నవీన్, తరుణ్, మానేజ్ నాయకులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న తల్లోజు ఆచారి

● కొల్లాపూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొల్లాపూర్ పట్టణంలో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో నాల్గవ రోజు శాకంబరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ఆర్యవైశ్యులు, పట్టణ ప్రజలు తమ మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వరిదెల షమీ వృక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని పట్టణ ప్రజలు దర్శించుకున్నారు. గాయత్రి ఎడ్యుకేషన్స్ ఛైర్మన్ సురగౌని శ్రీనివాస్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, ప్రశాంత్‌నగర్, తుర్కపల్లి , మాచారం గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో నాలుగోరోజు అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రి వేళల్లో మంటపాల ఆవరణలో మహిళల బతుకమ్మ నృత్యాలు, కోలాటల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్సవ కమిటీల సభ్యులు జయమ్మ, ప్రభావతమ్మ, సంభు శోభ, దీపిక, సరస్వతి, శేఖర్, సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, సురేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

- రూ.43.42 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- హాజరు కానున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, అక్టోబరు 6: కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.43.42 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా చేయనున్నట్లు చెప్పారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబరు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్లతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ పర్యటనకు ఏర్పాట్లు చేశామన్నారు. కల్వకుర్తి పట్టణంలో రూ.11.7 కోట్లతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలకు, కమ్యూనిటీ భవనాలకు కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలు, మినీ స్టేడియంలో బ్యాలెన్స్ పనులు, పట్టణంలో రూ.23కోట్లతో అమృత్-2 వాటర్ పథకానికి మంత్రి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో రూ.3.5 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం, వెల్దండ మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో అదనపు గదులకు శంకుస్థాపన ఉంటుందన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. జూనియర్ కళాశాల కేజీబీవీని ఇంటర్ స్థాయికి పెంపు, అదనపు గదులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరరాజనరసింహను ఆహ్వానించినట్లు చెప్పారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్, నాయకులు షానవాజ్‌ఖాన్, సంజీవ్‌కుమార్‌యాదవ్, శ్రీకాంత్, రాహుల్, సంతుయాదవ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

నేడు కొలువుదీరనున్న ఉమామహేశ్వర ధర్మపాలక మండలి

అచ్చంపేట: ఉమామహేశ్వర నూతన ధర్మపాలక మండలి కొలువుదీరనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆదివారం తెలియజేశారు. ఉమామహేశ్వరంలోని భోగమహేశ్వరంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ప్రమాణస్వీకారోత్సవానికి అటవీ, దేవాదాయ శాఖ, మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొననున్నట్లు వివరించారు. ఉదయం 12.50 గంటలకు అచ్చంపేట పట్టణానికి చేరుకొని అనంతరం రోడ్డు మార్గాన ఉమామహేశ్వర దేవస్థానాన్ని చేరుకొని ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు.

ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఉమామహేశ్వర నూతన అధ్యక్షుడిగా బీరం మాధవరెడ్డితో పాటు 13 మంది ధర్మకర్తల మండలి సభ్యులు కొలువు దీరుతారని తెలియజేశారు.

నేడు చేప విత్తనాల పంపిణీ ప్రారంభం

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం సింగవట్నం శ్రీవారి సముద్రంలో సోమవారం ఉదయం 9గంటలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేప విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి బిజినేపల్లి మండలం పాలెం పెంటోని చెరువు వద్ద చేప విత్తనాన్ని విడుదల చేస్తారని తెలిపారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల మేనేజింగ్ కమిటీ సభ్యులు డీఎఫ్‌సీఎస్ ఛైర్మన్ వాకిటి ఆంజనేయులుతో కలిసి ప్రాతినిధ్యం వహించిన సమావేశంలో చేపల విత్తనాల నిల్వలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

- బిజినేపల్లిలో 17 సంచులు..

బిజినేపల్లి, అక్టోబరు 6 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వెల్గొండ నుంచి వెల్గొండ గేట్ వైపు అనుమానాస్పదంగా వచ్చిన ఆటోను పట్టుకున్నట్లు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు. భాస్కర్, రషీద్ వెల్గొండ నుంచి ఆటోలో 17 ప్లాస్టిక్ సంచుల్లో దాదాపు పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోడేరులో 5.50 క్వింటాళ్ల బియ్యం సీజ్

కోడేరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బి య్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండ లంలోని ఎత్తం శివారులో రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా తనిఖీ చేయగా 5క్వింటాళ్ల 50కేజీల పీడీఎస్ బియ్యంగా గుర్తించి ఆటోను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆటో డ్రైవర్ మానపాడు రమేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మ తల్లికి పూజలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 6 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామశివారులో వెలసిన మైసమ్మ దేవతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల నలుమూలల నుంచి ఆదివారం 15వే ల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం హుండీ ద్వారా 61,042 రూపాయలు, టికెట్ల ద్వారా 26,970 రూపాయలు మొత్తం 88,012 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

శాంతియుత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి

- డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడి



కొల్లాపూర్‌లో దుర్గామాత మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

కొల్లాపూర్, అక్టోబరు 6 : శాంతియుత వాతావరణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని దుర్గామాత మండపాల నిర్వాహకులను డీఎస్పీ శ్రీనివాస్ కోరారు. ఆదివారం కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కొల్లాపూర్ మండల పరిధిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ కే.మహేష్, కొల్లాపూర్ ఎస్‌ఐ రుషికేష్, పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్, పెంట్లవెల్లి రామన్‌గౌడ్, కోడేరు ఎస్‌ఐ గోకారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారిన పడకండి

కోడేరు : సైబర్ నేరాల బారిన పడిక డబ్బులు పోగొట్టుకుని మోసపోకండని డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎత్తం గ్రామం బస్టాండ్ ఆవరణలో సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొల్లాపూర్ సీఐ మహేష్, స్థానిక ఎస్‌ఐ గోకారి, మాజీ సర్పంచ్ సాయిని వరలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాయిని శ్రీనివాస్‌రావు ప్రజలు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక



నూతన మండల కమిటీ సభ్యులు

చారకొండ, అక్టోబరు 6: ధర్మ సమాజ్ పార్టీ నూతన మండల కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్, ఎంజేఎస్ సెంట్రల్ కమిటీ సభ్యుడు రాధకృష్ణ మహరాజ్ సమక్షంలో ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చారకొండ చంద్రశేఖర్ మహరాజ్, ఉపాధ్యక్షుడిగా వంకేశ్వరం వెంకటేష్ మహరాజ్, కార్యదర్శిగా కావలి మల్లేష్ మహరాజ్, కోశాధికారిగా బండపల్లి నాగర్జున మహరాజ్, సభ్యులుగా కొండల్ మహరాజ్, ఉదయ్‌మహరాజ్, గణేష్ మహరాజ్, మహేష్ మహరాజ్, అయోధ్య మహరాజ్, మెగులయ్య మహరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పు సురేష్ మహరాజ్, ఎంజేఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధితో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తాం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 6: అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించి నియోజకవర్గంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం, భూమి పూజ నిర్వహించారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలు, ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని మహిళలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు మోతీకుమార్, రాధాకృష్ణ, హబీబ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.